క్లుప్తంగా

స్పోర్ట్స్‌మీట్‌లో శైలజ సత్తా



ట్రోఫీ అందజేస్తున్న మోతే శ్రీలతరెడ్డి

బౌద్ధనగర్: కోఠిలోని విక్టరీ గ్రౌండ్‌లో జరిగిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల స్పోర్ట్స్ మీట్‌లో బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ కంది శైలజ ప్రతిభ కనబరిచారు. క్యారమ్స్‌లో మొదటి, మ్యూజికల్ చైర్స్‌లో రెండో బహుమతి సాధించగా ఆమెకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి ట్రోఫీ, ప్రశంస పత్రంతో పాటు నగదు బహుమతి సాధించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం

రసూల్‌పురా: వేసవిలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందించామని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ తెలిపారు. శనివారం బోర్డు కార్యాలయంలోని తన చాంబర్‌లో వాటర్‌వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ శశాంక్‌తో సమావేశమై వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం 55 నుంచి 60 లక్షల గ్యాలన్ల తాగునీరు సరఫరా అవుతోందని కొన్ని ప్రాంతాల్లో మూడు, మరి కొన్ని బస్తీలు, కాలనీల్లో ఐదు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోందని అన్నారు. ప్రజలకు సరిపడ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని రామకృష్ణ వెల్లడించారు.

మురుగునీటి సమస్యలకు సత్వర పరిష్కారం

చిలకలగూడ: మురుగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జలమండలి మారేడ్‌పల్లి డీజీఎం కృష్ణ, శ్రీనివాసనగర్ సెక్షన్ మేనేజర్ నవ్యతో కలిసి శనివారం ఆమె మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామని, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను నిరంతరం పరిశుభ్రం చేసేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. లోప్రెషర్ సమస్య పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రజాసమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

నెహ్రూనగర్ పార్కులో శ్రీరామనవమి ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్: మారేడ్‌పల్లిలోని నెహ్రూనగర్ పార్కులో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని మారేడ్‌పల్లి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ పేర్కొంది. శనివారం పార్కులో అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అత్యంత రద్దీగా ఉండే దేవాలయాల్లో సీనియర్ సిటిజన్లు కల్యాణం వీక్షించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అందుకే తామే పార్కులో కల్యాణ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించవద్దని పార్కు డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు కొంత మంది అడ్డుకుంటున్నారని ఎవరు అడ్డుకున్నా ఉత్సవాలు మాత్రం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజారపు వెంకట్‌రావు, సీకే నర్సింగ్‌రావు, శంకర్, రఘువర్మ, వెంకటరత్నం పాల్గొన్నారు.

పర్యావరణ సంక్షోభం మానవాళికి సవాల్

ఉస్మానియా యూనివర్సిటీ: పర్యావరణ సంక్షోభం మానవాళి ముందున్న అతిపెద్ద సవాల్ అని పర్యావరణ వేత్త ప్రొ.పురుషోత్తమరెడ్డి అన్నారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై మూడు రోజులు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. సదస్సు కన్వీనర్ ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా ప్రొ.పురుషోత్తమరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యవరణాన్ని నిర్లక్ష్యం చేయడంతో మానవ సమాజం సంక్షోభాన్ని ఎదుర్కొనుందన్నారు. మూడ్రోజుల సదస్సులో 187 పరిశోధన పత్రాలు సమర్పించగా ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, డీన్ ప్రొ.స్టీవెన్‌సన్, దూరవిద్య డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, అధ్యాపకులు చలమల వెంకటేశ్వర్లు, శ్రీలత, కృష్ణకుమార్ పాల్గొని ప్రసంగించారు.


ధర్నాకు తరలిన బీజేపీ నాయకులు

కంటోన్మెంట్: నగరంలోని ధర్నాచౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ధర్నా కార్యక్రమానికి బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు భానుక మల్లికార్జున్ నేతృత్వంలో కార్యకర్తలు వెళ్లారు. ధర్నాకు వెళ్లే ముందు రామకృష్ణ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్స్ లీక్ జరిగినా సీఎం కేసీఆర్ స్పందించకపోవడం దారుణమని, అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వెళ్లినవారిలో రజిని రెడ్డి, అనురాధ, దయానంద్ ఉన్నారు.

ఆహ్లాదం పంచేలా ఉద్యానం

- కేఎల్ఎన్‌వై పార్కుకు మరిన్ని సొబగులు
- కళ్లు మిరిమిట్లుగొల్పేలా ప్రవేశద్వారాలు, ఆర్చిల నిర్మాణం
- రూ.2.41 కోట్లతో సుందరీకరణ పనులు
- నేడు నమూనాలను విడుదల చేయనున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: పక్షుల కిలకిలరావాలు.. నడి మధ్యన సుందర తటాకం దాని చుట్టూ మెలికలు తిరుగుతూ సాగిపోయే అందమైన వాకింగ్ ట్రాక్.. ఎటుచూసినా కనువిందు చేసే పచ్చదనపు పరవళ్లు ఆ పచ్చని బయళ్లపై భారతీయ ప్రాచీన యోగా విన్యాసాలు ఒకవైపు..శారీరక దృఢత్వానికి ఆలవాలంగా నిలిచే ఓపెన్ జిమ్ మరోవైపు.. సనత్‌నగర్ కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ (కేఎల్ఎన్‌వై) పార్కు విశిష్టతకు మారుపేరుగా నిలుస్తోంది. నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అతిపెద్ద పార్కుగా అవతరించిన కేఎల్ఎన్‌వై పార్కుకు మరిన్ని సొబగులు అద్దేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో అధికారులు కార్యాచరణ రూపొందించారు. సమారు అరెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కు సుందరీకరణకు రూ.2.41 కోట్లు మంజూరు కావడంతో మహా అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. దానికి సంబంధించి డిజైన్ పనులను ఇప్పటికే పూర్తి చేశారు.



కేఎల్ఎన్‌వై పార్కు వ్యూ

ఇవీ ప్రత్యేకతలు..

- ఇక్కడ చేపట్టే నూతన అభివృద్ధి పనుల్లో భాగంగా యువత, సీనియర్ సిటిజన్స్, మహిళల అవసరాలను తీర్చడమే కాకుండా పిల్లలు ఆడుకునేందుకు అన్ని రకాల ప్లే ఎక్విప్‌మెంట్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్లే ఏరియా చుట్టూ కలర్ ఫెన్సింగ్‌తో పాటు రబ్బర్ ఫ్లోర్, డబ్ల్యూయూపీసీ సీటింగ్ బెంచీలను ఏర్పాటు చేయనున్నారు.
- చెరువు చుట్టూ ఇప్పుడున్న పాత్‌వే లను అందమైన ఫ్లోరింగ్‌తో మరింతగా అభివృద్ధి చేస్తారు. ప్రత్యేకంగా సెల్ఫీలు తీసుకునేందుకు సెల్ఫీ పాయింట్స్‌నూ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు రంగురంగుల పూల మొక్కలతో కనులవిందు చేసే ల్యాండ్ స్కేపింగ్, పార్క్ ముందు, వెనుకా మెయిన్‌గేట్స్, ఆర్చిలను జిగేల్‌మనిపించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు.
- ప్రవేశ ద్వారాలను చూసీ చూడగానే సనత్‌నగర్‌లో ఉన్నామా..లేక విదేశాల్లో ఉన్నామా? అన్న భావన కలిగించే రీతిలో డిజైన్ చేయడం విశేషం.
- చెరువులో అక్కడక్కడ చూడ ముచ్చటైన షేపింగ్ ఎలిమెంట్స్‌తో శోభయామానంగా తీర్చిదిద్దనున్నారు. ఇవే కాకుండా రాత్రివేళ సైతం యావత్ పార్కు కాంతులీనే విధంగా లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు.
- పచ్చని చెట్లు సైతం రంగురంగుల కాంతులతో మెరిసిపోయేలా లైటింగ్‌ను ఏర్పాటుచేసి సందర్శకులు, వాకర్స్‌ను కనువిందు చేయనున్నారు.



కేఎల్ఎన్‌వై పార్కులో ల్యాండ్ స్కేపింగ్ నమూనా

- ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 1500 మంది వరకు వాకర్స్ వస్తుంటారు. వీరికి తోడు మరో 400 మంది వరకు సందర్శకులు ఉంటారు.
- ఇక్కడ చేపట్టే అభివృద్ధిపై రూపుదిద్దుకున్న డిజైన్లను ఆదివారం (నేడు) విడుదల చేయనున్నారు. దీనికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా హాజరై వాకర్స్, సందర్శకుల నుంచి పార్కు సుందరీకరణపై ఫీడ్‌బ్యాక్‌తో పాటు మరిన్ని అభిప్రాయాలను తెలుసుకోనున్నారు.

> **నగరంలోనే ప్రత్యేకంగా..**
>
> ఎప్పటికప్పుడు ప్రజావసరాలను తెలుసుకుని వాటిని తీర్చడమే కాకుండా సనత్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా అభివృద్ధి పనులు కొనసాగించడం జరుగుతుంది. అందులో భాగంగా వాకర్స్, సందర్శకులను మరింత ఆకట్టుకునే రీతిలో రూ.2.41 కోట్లతో కేఎల్ఎన్‌వై పార్కును సుందరీకరించనున్నాం. ఆకర్షణీయమైన ఆర్చిలు, మెయిన్‌గేట్ల నిర్మాణంతో పాటు పార్కు లోపల పిల్లలు, పెద్దలు ఆహ్లాదంగా గడిపేలా అధునాతన సౌకర్యాలు కల్పిస్తాం.
>
> –మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

జడ్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు



పోస్టర్ ఆవిష్కరణలో కళాశాల ప్రతినిధులు

అమీర్‌పేట: అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయమైన జడ్సన్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించాలనుకునే తెలుగు విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని ద పార్క్ హయత్ హోటల్ శనివారం అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 28వ తేదీన అమీర్‌పేటలోని ఆదిత్యపార్క్ హోటల్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందని రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రతి ఏడాది ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు తీసుకుంటున్నారని వారి కోసం ప్రత్యేకంగా రూ.7,200 డాలర్ల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి పవన్ శ్రీవాస్తవ తెలిపారు. ఎంబీఏ బిజినెస్ ,ఇన్ఫర్మేటిక్స్, మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హ్యూమన్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్, ఎంఏ కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు వర్గీస్ మథాయ్,డాక్టర్ రాణి మథాయ్, కిమ్ జాన్సన్, డానా ఒనాయేమి పాల్గొన్నారు.

పాఠశాల భవనంపై రాజకీయం చేయడం తగదు

కార్పొరేటర్ హేమ



సికింద్రాబాద్: ప్రభుత్వ పాఠశాల భవనంపై ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని కార్పొరేటర్ సామల హేమ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో గత 30 సంవత్సరాలుగా ఉన్న ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌ను డిప్యూటీ స్పీకర్ చొరవతో ఇంటర్, డిగ్రీ కళాశాల కల సాకారం అయిందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో ప్రైమరీ స్కూల్, ఇంటర్మీయేట్, డిగ్రీ కళాశాల వరకు ఒకే భవనం ఉండాలని ప్రత్యేక శ్రద్ధతో సీఎం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ప్రైమరీ స్కూల్‌తో పాటు, ఇంటర్, డిగ్రీ కళాశాల భవనాలకు జీవో తీసుకొచ్చి రూ. 30 కోట్ల పైచిలుకు నిధులతో భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీలోని మోడల్ స్కూల్‌కు షిఫ్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారని వివరించారు. రాష్ట్రంలోనే ప్రభుత్వ పాఠశాల, కళాశాల భవనాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఆయన కృషి చేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇది వరకు విద్యార్థులు చెట్లకింద కూర్చొని పాఠాలు విన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు నోరు ఎందుకు మెదపలేదని ప్రశ్నించారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసులు

రసూల్‌పురా: నార్త్‌జోన్ పరిధిలోని కార్ఖాన మోడల్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో తులసి హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని వైద్య పరీక్షలు చేయించామన్నారు.

రాష్ట్రంలో రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రం అవినీతి అక్రమాలకు అడ్డాగా నిలిచిన రాష్ట్రంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం రాత్రి తుకారాంగేట్‌లోని వెంకట్‌నగర్‌లో నిర్వహించిన శక్తి కేంద్రం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అవినీతి, అక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. తెలంగాణ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇచ్చిన రేషన్ కార్డులే కాని, తెలంగాణలో ఇప్పటివరకు కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డు రాకుండా కేసీఆర్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి, నాయకులు సారంగపాణి, శ్యాం సుందర్, హరి, రాజశేఖర్, కన్నాభిరాం, హంసరాజ్, మహేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునఃనిర్మాణ పనులకు ఏప్రిల్ 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారన్నారు. అదే విధంగా ఎంఎంటీఎస్ రెండో ఫేస్ సర్వీస్‌లను కూడా ప్రారంభించనున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సాధన, చెరియన్‌తో రవీందర్ గుప్తా

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఏడవ వార్డు తిరుమలగిరి పరిధిలోని సూర్య ఎన్‌క్లేవ్‌లోని సమస్యలను కంటోన్మెంట్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగా రవీందర్ గుప్తా హామీ ఇచ్చారు. శనివారం ఆయన సూర్య ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తూ కాలనీ అధ్యక్షులు సాధన, మాజీ అధ్యక్షులు చరియన్‌ను కలిసి మాట్లాడారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరానికి చర్యలు తీసుకుంటానన్నారు.

మాణిక్‌రావుఠాక్రేతో నాయకుల సమావేశం



మాణిక్‌రావు ఠాక్రేతో కాంగ్రెస్ నాయకులు

లాలాపేట: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారన్నారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌ను గెలిపించడంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వం పగ్గాలు చేపట్టే దిశగా కృషి చేయాలన్నారు. ఠాక్రేను కలిసిన వారిలో అమర్‌నాథ్‌గౌడ్, సందీప్‌రాజు, కృష్ణకుమార్‌గౌడ్, బ్రహ్మజీ, రాజు సాగర్ ఉన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టాలి



జీపుయాత్రను నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

అడ్డగుట్ట: బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రలో భాగంగా శనివారం అడ్డగుట్ట సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి జీపుయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాల నుంచి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. సంత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, బ్లాక్ మనీ వెలికితీస్తామని పేద ప్రజల ఖాతాల్లో జమచేస్తామని అనేక మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇష్టానుసారంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ యాత్రలో వెంకటేష్, అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, మహేందర్, గోపాల్, వీరలక్ష్మీ, మధు, ఎల్లయ్య, బాలయ్య, అంజమ్మ, పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేదికపై దాసోజు శ్రవణ్ తదితరులు

సనత్‌నగర్: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బేగంపేట పైగా ప్యాలెస్‌లో శనివారం కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశానికి ఆయన జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సొంత స్థలం ఉన్నా వారు ఇల్లు నిర్మించుకునేందుకు త్వరలోనే గృహలక్ష్మీ కింద రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ప్రవేశపెట్టారని పేద, మధ్య తరగతి పిల్లలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలను మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి నష్టపోవద్దని సూచించారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలసాని సాయి కిరణ్‌యాదవ్, కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, ఉప్పల తరుణి, నాయకులు శ్రీహరి, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, అక్బర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

నీటి వృథాను అరికట్టాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన నల్లాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీ ప్రజలు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పైగా ప్యాలెస్ సమీపంలోని ఏకే టవర్స్ వద్ద రూ.23.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం రమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి తలసాని అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో రూ.40.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరగా ఆయన సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. మంత్రి వెంట అత్తెల్లి అరుణగౌడ్, డీసీ ముకుంద్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం రమణారెడ్డి తహసీల్దార్ శైలజ ఉన్నారు.


ఓయూలో ముగిసిన సదస్సు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ, డీఆర్‌డీఓ, ఇస్రో ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ హైదరాబాద్ చాప్టర్ (ఐఎస్ఎస్ఇ) ఆధ్వర్యంలో 5వ జాతీయ సదస్సులో సిస్టమ్ అప్రోచ్ ఫర్ సెల్ఫ్ రిలయోన్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఎస్ఏఎస్‌టీ–2023) అనే అంశంపై జరిగిన సదస్సులో పలువురు సైంటిస్టులు వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించి సదస్సుకు హాజరైన ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందచేశారు.

- ఇస్రో, డీఆర్‌డీఓ ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆయుధాల ప్రదర్శన ఇంజినీరింగ్ విద్యార్థులను ఆలోచింపజేశాయి. అగ్ని, ఆకాష్ క్షిపణులు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, రాకెట్ లాంచర్లు, డ్రోన్లు, మిస్సైల్స్ తదితర ఆయుధాలను ప్రదర్శించినట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు.

ముగ్గురిపై దాడిచేసిన రౌడీషీటర్‌పై కేసు



షరీఫ్

అమీర్‌పేట: అకారణంగా ముగ్గురిపై దాడిచేసిన ఓ రౌడీషీటర్‌పై కేసు నమోదైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ వివరాల ప్రకారం.. బల్కంపేట నీమ్‌కార్ నగర్‌లో ఉండే షరీఫ్‌పై ఎస్ఆర్‌నగర్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. శుక్రవారం రాత్రి బీకేగూడ లైబ్రరీ పార్కు సమీపంలోని టీ స్టాల్ వద్ద టీ తాగేందుకు వచ్చే వారిని తిడుతూ షరీఫ్ న్యూసెన్సు చేస్తుండగా బాపూనగర్ నివాసి కత్రోత్ అమరేందర్‌సింగ్ కుమార్ అనే వారించాడు. దీంతో రెచ్చిపోయిన షరీఫ్ రాయి తీసుకుని కత్రోత్ తల పగులగొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సోదరుడు శ్రీధర్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పగా వెంటనే అక్కడికి వచ్చిన శ్రీధర్ షరీఫ్‌తో మాట్లాడుతుండగా శ్రీధర్‌ను కూడా కొట్టడంతో శ్రీధర్ సెల్‌ఫోన్ ధ్వంసమైంది. అక్కడి నుంచి ఓరియంట్ కేఫ్ వద్దకు వెళ్లిన షరీఫ్ అక్కడి టీ తాగుతున్న బల్కంపేటకు చెందిన బ్యాంకు ఉద్యోగి వినోద్ కుమార్‌పై దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి ఆత్మీయ సమ్మేళనాలు

రసూల్‌పురా: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో నేటి (ఆదివారం) నుంచి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత తెలిపారు. ఈ మేరకు క్యాంప్ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులు, బోర్డు మాజీ సభ్యులతో సమావేశమయ్యారు. నేడు బొల్లారంలో పదకొండు గంటలకు మొదటి ఆత్మీయ సమ్మేళనం, ఏప్రిల్ 1న ఏడవ వార్డులో లాల్‌బజార్ మహంకాళి ఆలయం ఆవరణలో, 2వ తేదీన ఒకటవ వార్డు న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో, ఏప్రిల్ 8న రెండవ వార్డు గన్‌బజార్ కమ్యూనిటీ హాల్, 9న మూడవ వార్డు గాంధీనగర్, 16న నాలుగవ వార్డు పికెట్ కమ్యూనిటీహాల్, 22న ఐదవ వార్డు వాల్మీకినగర్, 23న ఆరవ వార్డు తాడ్‌బండ్‌లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వర్కర్స్ క్వార్టర్స్‌లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. శనివారం కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్‌లోని కంటోన్మెంట్ వర్కర్స్ క్వార్టర్స్‌లో ఆయన పర్యటించారు. డబుల్ బెడ్రూమ్‌లు రేషన్‌కార్డులు, తహసీల్దార్ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు, కొందరికి ఇంటి నంబర్లు లేవని నంబర్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారుల సహాయ సహకారంతో పాటు తన ఫౌండేషన్ నుంచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాణి, వసంత, శోభ, స్వరూప, రాజశ్రీ, షణ్ముగం పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



ఉస్మానియా యూనివర్సిటీ: పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాహుల్‌పై బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని నినాదాలు చేశారు. ప్రొ.గాలి వినోద్‌కుమార్, వెంకటదాస్, కాశీం, విద్యార్థి నేతలు ఆర్ఎస్ శంకర్, శ్రీనివాస్, సత్య, గడ్డం శ్యాం పాల్గొన్నారు.